
# నేడు సీఎం బ్రేక్ ఫాస్ట్‌కు శ్రీకారం

- సర్కారు బడి పిల్లలకు టిఫిన్
- జిల్లాలో మూడు హైస్కూళ్లలో ప్రయోగాత్మకంగా ప్రారంభం
- హాజరుకానున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ రాజయ్య
- ఈ నెల 24 నుంచి పూర్తిస్థాయిలో అమలు

జనగామ, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం ఈనెల 6న జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రారంభం కానున్నది. నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున మూడు పాఠశాలలను ఎంపిక చేసిన విద్యాశాఖ అధికారులు పాలకుర్తి మండలం వావిలాలలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ మండలం వడ్లకొండలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రఘునాథపల్లి మండలం నిడిగొండలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. మిగిలిన అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దసరా కానుకగా ఈనెల 24 నుంచి పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 640 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఇందులో 508 జిల్లా పరిషత్ పాఠశాలలు, 12 కేజీబీవీలు, 8 మోడల్ స్కూల్స్, 10 ఎయిడెడ్ స్కూల్స్‌లోని మొత్తం లక్షా 80 వేల మంది విద్యార్థులకు సీఎం బ్రేక్ ఫాస్ట్ అందించనున్నారు. ఇప్పటికే 2015 జనవరి 1 నుంచి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సూపర్ ఫైన్ వెరైటీ బియ్యంతో రూ.71.22 కోట్ల వ్యయంతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నది. నాణ్యమైన విద్యను అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎదిగే వయస్సులో పిల్లలకు పోషకాహారాన్ని అందించేందుకు వినూత్న పథకానికి శ్రీకారం చుట్టబోతున్నది. బడి ప్రారంభానికి ప్రార్థన (స్కూల్ అసెంబ్లీ)కి ముందే ఉదయం 9.30 గంటలకు విద్యార్థులకు రోజుకో వెరైటీ వేడివేడిగా బ్రేక్‌ఫాస్ట్‌ను అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే సన్నబియ్యం, రాగిజావ, మధ్యాహ్న భోజనం, కోడిగుడ్డు/అరటిపండు, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల సమయంలో స్నాక్స్‌ను అందజేస్తున్నది. తాజాగా సుపోషణలో భాగంగా బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయబోతున్నది. బడి ప్రారంభానికి ముందే ఉదయం 9.30 గంటలకు విద్యార్థులకు సోమవారం గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ, మంగళవారం బియ్యం రవ్వ కిచిడి, చట్నీ, బుధవారం బొంబాయ్ రవ్వ ఉప్మా, సాంబార్, గురువారం రవ్వ పొంగల్, సాంబార్, శుక్రవారం మిల్లెట్ రవ్వ కిచిడీ, సాంబార్, శనివారం గోధుమ రవ్వ కిచిడీ, సాంబార్ అందిస్తారు.


ఎల్‌వోసీ పత్రాన్ని ఇస్తున్న బీఆర్ఎస్ నాయకుడు పెద్ది రాజిరెడ్డి

## బాధితుడికి రూ.4 లక్షల ఎల్ వోసీ అందజేత

నర్మెట, అక్టోబర్ 5: మండలంలోని ఇప్పలగడ్డ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సుకేశ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులు పెరగడంతో దీనిపై బీఆర్ఎస్ నర్మెట, తరిగొప్పుల మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డిని బాధితుడి కుటుంబ సభ్యులు కలిసి సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన ఆయన రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బాధితుడు సుకేశ్ వైద్య ఖర్చుల కోసం రూ.4 లక్షల ఎల్‌వోసీని సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేయించారు. సంబంధిత పత్రాలను గురువారం హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో కుటుంబసభ్యులకు పెద్ది రాజిరెడ్డి అందించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బాధితుడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కోఅప్షన్ సభ్యుడు ఎండీ గౌస్, బీఆర్ఎస్ నాయకుడు కుంటి రమేశ్, తెలంగాణ జాగృతి మండల అధ్యక్షుడు బైరగోని మోహన్ పాల్గొన్నారు.

## కోలుకొండలో కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభం

దేవరుప్పుల, అక్టోబర్ 5: మండలంలోని కోలుకొండలో నాలుగో విడుత కుట్టు శిక్షణను గురువారం ఎంపీపీ బస్వ సావిత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగేందుకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేపట్టిన బృహత్కార్యక్రమమే కుట్టుశిక్షణ అన్నారు. మండలంలో ఇప్పటికే వెయ్యి మంది మహిళలకు శిక్షణనివ్వగా ప్రభుత్వ సర్టిఫికెట్లు పొందారన్నారు. శిక్షణ పూర్తయిన వారికి ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా కుట్టు మిషన్లు ఇస్తామన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కోలుకొండ, రాంచంద్రాపురం సర్పంచ్‌లు కూర్నాల రవి, నాగంపల్లి బక్కమ్మ, ఏపీఎం వెంకట్‌రెడ్డి, రైతుబంధు సమితి గ్రామ కోఆర్డినేటర్ కోతి పద్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాకస్వామి, కరుణ, ఖాసీం, చందన మండల సమాఖ్య అధ్యక్షురాలు నల్ల ఉమ, ఐకేపీ సీసీ సోమనారాయణ పాల్గొన్నారు

# కాంగ్రెస్ నేతల మాటలు నమ్మొద్దు

- అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి
- బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి


సముద్రాలతో కడియం శ్రీహరితో బీఆర్ఎస్ శ్రేణులు, స్థానికులు

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 5 : దశాబ్దాల పాటు దేశాన్ని, రాష్ర్టాన్ని పాలించిన కాంగ్రెస్ పేదలకు చేసిందేమీ లేదని, అవినీతి, కుంభకోణాలకు కేరాఫ్‌గా మిగిలిన ఆ పార్టీ నేతల మాయమాటలను ప్రజలు నమ్మొద్దని బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ర్టాన్ని సీఎం కేసీఆర్ అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నందున నిండుమనసుతో ఆశీర్వదించాలని కోరారు. గురువారం మండలంలోని, ఇప్పగూడెం, సముద్రాల, రంగరాయగూడెం, కోమటిగూడెం, అక్కపల్లిగూడెం గ్రామాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, ప్రజలు కడియం శ్రీహరికి అపూర్వ స్వాగతం పలికారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానని అన్నారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ప్రజలు సేవలందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నా నిజాయితీ, నిబద్ధత, వ్యక్తిత్వం అందరికీ తెలుసని వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా ఆశీర్వదించాలని కడియం శ్రీహరి కోరారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా బాధ్యతలు నిర్వహించినప్పుడు ఈ గ్రామాలు జనగామ నియోజకవర్గంలో ఉండడంతో ప్రత్యేక దృష్టి పెట్టలేకపోయానని, అయినా గ్రామస్తుల కోరిక మేరకు తనపరిధిలో అభివృద్ధికి కృషి చేశానని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని, వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తే ఏడాదిలోనే సమస్యలను పరిష్కరిస్తానని, సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా చూస్తానన్నారు.

### కాంగ్రెస్ వాగ్దానాలు మోసపూరితం

కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అక్కడ రూ.1200 పెన్షన్ ఇస్తున్నదని, తెలంగాణలో అధికారంలోకి వస్తే ఆసరా పింఛన్లను రూ.4 వేలకు పెంచి ఇస్తామని మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నదని కడియం శ్రీహరి అన్నారు. కాంగ్రెస్‌కు ఓటువేస్తే ఆగమవుతామని, ఆ పార్టీ నాయకుల మాటలు నమ్మొద్దన్నారు. మతతత్వ బీజేపీకి రాష్ట్రంలో ఉనికిలేదన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు మీరు అధికారంలో ఉన్న రాష్ర్టాల్లో ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలని కాంగ్రెస్, బీజేపీ నేతలకు ఆయన సవాల్ విసిరారు. తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించడంతోపాటు వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతుబీమా పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్ మూడో సారి ముఖ్యమంత్రి అవుతారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి, బెలిదె వెంకన్న, బూర్ల శంకర్, నగరబోయిన యాదగిరి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు తోట వెంకన్న, సర్పంచ్‌లు పోగుల సారంగపాణి, జక్కుల పరశురాములు, గూడెల్లి అశోక్, మల్లేశం, రాజు, కోతి రేణుకా రాములు, ఎంపీటీసీలు నెలమంచి శైలజా అజయ్ రెడ్డి, రజాక్ యాదవ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు సురేశ్ గౌడ్, పల్లె రవి, కుమార్, రాజు, ఉప సర్పంచ్‌లు ఇమ్మడి హరిప్రసాద్, ఆంజనేయులు, నారాయణ, నాగరాజు, సొసైటీ డైరెక్టర్ చట్ల యాకయ్య, మాజీ సర్పంచ్‌లు కుమారస్వామి, రమేశ్, మంద రాజు, వెన్నకూస రాంనర్సయ్య, లింగనబోయిన శ్రీను, దైద ఎలిషన్, ఎల్లగౌడ్, చట్ల కుమార్, జీ యాదగిరి పాల్గొన్నారు.

## రాజకీయాలకతీతంగా మంత్రి ఎర్రబెల్లికి రజకుల మద్దతు


మంత్రి ఎర్రబెల్లితో సింగరాజుపల్లి రజక సంఘం నాయకులు

దేవరుప్పుల, అక్టోబర్ 5: మండలంలోని సింగరాజుపల్లికి చెందిన రజకులు రాజకీయాలకతీతంగా రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మద్దతు తెలిపారు. హనుమకొండలోని మంత్రి ఎర్రబెల్లి నివాసంలో గురువారం సింగరాజుపల్లికి చెందిన 22 రజకుల కుటుంబాలు మంత్రి ఎర్రబెల్లిని కలిసి తామంతా బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రజకుల అభివృద్ధికి కృషి చేస్తున్నదన్నారు. గ్రామంలో మంత్రి ఎర్రబెల్లి చేసిన అభివృద్ధి పనులు బాగున్నాయన్నారు. మంత్రిని కలిసిన వారిలో రజక సంఘం గ్రామ అధ్యక్షుడు మడిపల్లి శేఖర్, ప్రధాన కార్యదర్శి మడిపల్లి రమేశ్, కోశాధికారి మడిపల్లి శోభన్, కార్యనిర్వాహక సభ్యులు యాదగిరి, మహేందర్, అశోక్, శోభన్, సంపత్, భాస్కర్, కుల పెద్దలు మడిపెల్లి నర్సయ్య, యాదగిరి, యాకయ్య, దుర్గయ్య, మల్లయ్య, కాసర్ల నర్సింహులు, అంజయ్య, అనిల్, సాయిరాం, అశోక్, సాగర్, శ్రీకాంత్, భిక్షపతి, శ్రీనివాస్, రాములు, చిన నర్సింహ ఉన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లింగాల రమేశ్‌రెడ్డి., బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మేకపోతుల నర్సింహ పాల్గొన్నారు.

## దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ధ్వజా రోహణం

జనగామ చౌరస్తా, అక్టోబర్ 5 : జనగామ పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ఆలయం వద్ద దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం వేద పండితులు మేళ్లచెర్వు వెంకట అప్పయ్య శాస్త్రి, పార్నంది శ్రీనివాస శర్మ, యళ్లంబట్ల ప్రసాద్, అవ్వారు ఉమానాథశర్మ, తిరుపతి లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ధ్వజా రోహణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మర్యాల సత్తయ్య, సమిశెట్టి రవిందర్, గందె సుధాకర్, మాశెట్టి రవిందర్, గంగిశెట్టి ప్రమోద్ కుమార్, మినుకూరి రవిందర్‌రెడ్డి, లింగమూర్తి, సతీశ్, నర్సింహరావు, వినయ్ కుమార్, జైన వెంకట రమణ, అశోక్, ప్రకాశ్, కీర్తి నర్సయ్య, రాము పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న జడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి

**బాధితుడి వైద్య ఖర్చులకు రూ.25 వేలు సాయం**


ఆర్థిక సాయం చేస్తున్న వంశీధర్‌రెడ్డి

లింగాలఘనపురం, అక్టోబర్ 5 : కష్టాల్లో ఉన్నవారికి తన వంతు చేయూతనందిస్తున్న జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ఆపదలో ఉన్న కుటుంబానికి గురువారం రూ.25 వేలు ఆర్థిక సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని వడిచర్లకు చెందిన చిటుకల సత్యనారాయణ అనారోగ్యానికి గురై ఇంట్లో ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి గత నెల రూ.5 వేలు అందించారు. మెరుగైన వైద్యం కోసం సత్యనారాయణను హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్సకు రూ.30 వేలు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలపడంతో విషయాన్ని జడ్పీటీసీకి వివరించారు. దీంతో వంశీధర్ రెడ్డి దవాఖానకు వెళ్లి డాక్టర్లతో మాట్లాడారు. ఎల్‌వోసీ వస్తేనే చికిత్స మొదలెడతామని సూచించారు. దీంతో జెడ్పీటీసీ గుడి వంశీదర్‌రెడ్డి ఆ కుటుంబానికి గురువారం నిమ్స్ దవాఖానాలో రూ.25 వేలు అందించారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ అండగా నిలిస్తే వారికెంతో మనోధైర్యం కలుగుతుందన్నారు.

## నీర్మాలలో వైద్య శిబిరం

దేవరుప్పుల, అక్టోబర్ 5: మండలంలోని నీర్మాలలో వైద్యశాఖ గురువారం ఆరోగ్యశిబిరం ఏర్పాటు చేయగా సర్పంచ్ మలిపెద్ది శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. మండల వైద్యాధికారి పూజ జ్వరపీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవఖాన వైద్యురాలు జెస్సిక, ఏఎన్ఎం దేవేంద్ర, కవిత, ఆశ కార్యకర్తలు ఎన్నెం యాదలక్ష్మి, పద్మ, మాధవి, శారద పాల్గొన్నారు.

## 23న దసరా, 22న సద్దుల బతుకమ్మ

కొడకండ్ల, అక్టోబర్ 5 : ఈ నెల 23న దసరా పండుగ నిర్వహించుకోవాలని ప్రముఖ పంచాంగ కర్త, కొడకండ్ల సిద్ధాంతి పాలకుర్తి గౌతమ్ శర్మ సిద్ధాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న సోమవారం జరుపుకోవడం శాస్త్రం అని, దశమి శ్రావణ నక్షత్రం పగలు ఉండడంతో ఆ రోజు దసరా పండుగ జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. 14వ తేదీ శనివారం బతుకమ్మ , 22న సద్దుల బతుకమ్మ పండుగ జరుపుకోవాలని కోరారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

లింగాలఘనపురం, అక్టోబర్ 5 : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన సంపంగి రాజు మద్యం సేవించి బొలెరో వాహనాన్ని నడుపుతుండగా బుధవారం నెల్లుట్ల ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు తనిఖీ చసి అదుపులోకి తీసుకున్నారని ఎస్సై తెలిపారు. హనుమకొండ జిల్లాకు చెందిన చినమల్ల నరేశ్ మద్యం సేవించి ప్రైవేటు బస్సు నడుపుతుండగా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఇద్దరిని గురువారం జనగామలోని కోర్టులో ప్రవేశ పెట్టగా సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటరాంనర్సయ్య ఇద్దరికీ రెండురోజుల జైలు శిక్షతోపాటు రూ.2 వేలు జరిమానా విధించారని తెలిపారు.